క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన బీవీఎస్ రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: లింగపాలెం గ్రామానికి చెందిన చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త, బెంగుళూరు మైత్రి డెవలప్పర్స్ అధినేత బీవీఎస్ రెడ్డి ఢిల్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి సీఎం ఆరా తీసినట్లు బీవీఎస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



దాత సాంబశివరావుకు రసీదులను అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి తెనాలికి చెందిన దాత ఏవీ సాంబశివరావు ఆదివారం మందులను ఉచితంగా అందజేశారు. 15 వందల మంది భక్తులకు సరిపడా ఈ మందులను ఆలయ సూపరింటెండెంట్ రమణరాజుకు అందించారు. వీటిని కాలినడక భక్తులకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దాతను రమణరాజు అభినందించి, సబంధిత రసీదులను ఆయనకు అందజేశారు.

రహదారిపై కుప్పకూలిన వృక్షం



ద్వారకాతిరుమల కొత్త బస్టాండు వద్ద రహదారిపై అడ్డంగా పడి ఉన్న వృక్షం

ద్వారకాతిరుమల: స్థానిక కొత్త బస్టాండు వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం ఒక వృక్షం ఉన్నట్టుండి కుప్పకూలింది. నిత్యం వాహన రాకపోకలు, జనసంచారంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దాంతో ఆ ప్రాంతవాసులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు ట్రాక్టర్ సహాయంతో చెట్టును పక్కకు తొలగించడంతో సమస్య తీరింది.

వృద్ధాశ్రమానికి విరాళం



రూ.50 వేల చెక్కును అందజేస్తున్న కరాటం వెంకటరెడ్డి నాయుడు

జంగారెడ్డిగూడెం: స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి ఆదివారం బుట్టాయగూడెంకు చెందిన వర్జీనియా రైతు సంఘం నాయకుడు కరాటం వెంకటరెడ్డి నాయుడు రూ.50 వేల విరాళాన్ని అందించారు. ఆశ్రమ నిర్వాహకులు జయవరపు శేఖర్‌కు విరాళం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వహణకు దాతలు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. వామిశెట్టి వెంకటేశ్వరరావు, గరికిపాటి రవీంద్ర, వామిశెట్టి శివ, వామిశెట్టి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర ఉత్సవాల్లో నగర మేయర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని వీవీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ జాతర మహోత్సవంలో మేయర్ అమ్మవారికి తొలిబిందె నీళ్లస్నాన అభిషేకం చేశారు. తొలుత స్థానికులు మేయర్ నూర్జహాన్‌కు స్వాగతం పలికి అమ్మవారి ఆలయంలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి మేయర్ పసుపు, కుంకుమలు, చీర సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు అమ్మవారికి 101 బిందెలతో స్నానం ఆచరింపజేశారు. అనంతరం అమ్మవారికి చద్ది నైవేద్యాలు, వేడి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

గిరిపల్లె గూటికి నాణ్యమైన వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య విప్లవం
- మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్తున్న స్పెషలిస్టు వైద్యులు
- నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 13 వేల మందికి వైద్య పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం అందిస్తున్న దృశ్యం (ఫైల్)



అపస్మారక స్థితిలో ఉన్న గిరిజన మహిళకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతిష్టాత్మకంగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది. స్పెషలిస్టులు, వైద్యులను గ్రామాలకు పంపిస్తూ ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తూ వారికి ఆరోగ్య భరోసా కల్పిస్తుంది. ఈ వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. గిరిజన ప్రాతంలోని మారుమూల పల్లెల్లో సైతం వైద్యశిబిరాలు నిర్వహించడంతో గిరిపుత్రులకు ఈ కార్యక్రమం మరింత వరంగా మారింది. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. తమ గ్రామాలకే వైద్య నిపుణులు రావడంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిశిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది.

13 వేలకు పైగా వైద్య పరీక్షలు

గిరిజన ప్రాంతంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ సచివాలయం, మండల పరిషత్, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో ఈ వైద్య శిబిరాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇప్పటివరకూ 33 వైద్యశిబిరాలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. అలాగే సుమారు 13 వేల మందికి పైగా వైద్యసేవలు అందించామన్నారు. ఈ శిబిరాల్లో ఎక్కువగా బీపీ, సుగర్‌తోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ముఖ్యంగా ఈ వైద్య శిబిరాలను పౌష్టికాహార లోపం ఉన్నవారు, గర్భిణులు, బాలింతలు ఎక్కువగా వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.

1265 మందికి కంటి పరీక్షలు

జగనన్న సురక్ష కార్యక్రమం వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. గిరిజన మండలాల్లో ఇప్పటివరకూ నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో సుమారు 1,265 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 66 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 335 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 26 మందికి శుక్లం ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. అదేవిధంగా 2650 మంది పిల్లలకు కంటి పరీక్షలు చేయగా 196 మందికి కళ్లజోళ్ల కోసం రిఫర్ చేశారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వస్తుంది. మారుమూల గ్రామాల్లో సైతం వృద్ధులు, మహిళలు, పిల్లలు ఈ శిబిరాలను వినియోగించుకుంటున్నారు. నిర్దేశించిన తేదీ వరకూ జరిగే ఈ శిబిరాల విజయవంతానికి కృషి చేస్తాం.

– డాక్టర్ ప్రవీణ్, దొరమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి, బుట్టాయగూడెం మండలం

శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర



శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: పాలకొల్లు నుంచి ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రానికి 1,170 మంది భక్తులు పాదయాత్రగా ఆదివారం చేరుకున్నారు. పాలకొల్లులోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గురుస్వామి ఎస్వీవీకే రమణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ పాదయాత్ర, ఆదివారం మధ్యాహ్నం నాటికి క్షేత్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా కాలినడక భక్తులకు దేవస్థానం అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు. అలాగే వారందరికీ శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు. తాము చేపట్టిన 11వ పర్యాయం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తయిందని గురుస్వామి రమణ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పంచాయతీ పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని, కరోనా విలయ తాండవం నుంచి వారు చేస్తున్న సేవలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని సర్పంచ్ ఉప్పల పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం కన్నాపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా హైస్కూల్ స్వీపర్స్‌తో పాటు పదిహేనుళ్లుగా గిరిజన గ్రామాలలో సేవలందిస్తున్న సోషల్ వర్కర్ సాదెం మంగను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఎంపీటీసీ షేక్ బాజీ, టి.పార్థసారథి, ట్రస్ట్ కన్వీనర్ కట్టా లక్ష్మి పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణాన్ని పొడిగించాలని వినతి



డ్రెయినేజీ నిర్మాణాన్ని పొడిగించాలని కోరుతున్న బయ్యనగూడెం గ్రామస్తులు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం గ్రామం మీదుగా వెళ్లిన జాతీయ ప్రధానరహదారి 516 (డి)కి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణాన్ని పొడిగించాలని బయ్యనగూడెం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు మాట్లాడుతూ జాతీయ రహదారి రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణాన్ని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వరకు నిర్వహిస్తున్నారని, అయితే మరో 150 మీటర్లు నిర్మాణం పెంచి రామకోనేరు కాలవలోకి డ్రెయినేజీ నిర్మాణాన్ని పొడిగించడం వల్ల గ్రామంలోని తమ ప్రాంతం ముంపు బారి నుంచి బయటపడగలదని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ బాపిరాజు, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు కె.విష్ణుష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం పునర్నిర్మాణం పూర్తి



బయ్యనగూడెంలో పునర్నిర్మాణం జరుపుకున్న రామాలయం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో రామాలయం పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు బయ్యనగూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకోదండ రామాలయ నిర్మాణానికి టీటీడీ శ్రీవాణీ ట్రస్ట్ తరఫున మంజూరు చేసిన రూ.పది లక్షలతోపాటు భక్తుల నుంచి వచ్చిన సుమారు రూ.50 లక్షల విరాళాలతో రామాలయ నిర్మాణం పూర్తయ్యిందని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అభ్యర్థన మేరకు మంత్రి కొట్టు సత్యనారాయణ నిధుల మంజూరుకు సహకరించారన్నారు. కాగా గత మార్చి 17వ తేదీన విగ్రహ ప్రతిష్టతో పాటు ఆలయ ప్రారంభోత్సవం జరుపుకోగా మిగిలి ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి గ్రామస్తులు నిత్య పూజాది కైంకర్య వేడుకలు నిర్వహిస్తున్నారు.

కఠారి సీతారాంబాబుకు సత్కారం



సీతారాంబాబును సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కఠారి సీతారాంబాబును ఆదివారం స్థానిక నాయకులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న ఎస్ఆర్ గెస్ట్‌హౌస్‌లో ఈ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కఠారి సీతారాంబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపును ఇస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీని గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శింగంశెట్టి సత్తిరాజు, అనన్య చిత్రం డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజు, మాజీ సర్పంచ్ బుద్దాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొయ్య లీలాధర్‌రెడ్డి, అల్లం రాంబాబు, కళ్లెం గంగరాజు, గూడపాటి ఆనంద్‌కుమార్, పీతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర ఉత్సవాలు



జాతరను ప్రారంభిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని ఆదివారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ దర్శించుకున్నారు. ముత్యాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారి జాతరను రథం నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జీవించాలని, రాష్ట్రంలో పంటలు బాగా పండాలని 70 ఏళ్లుగా జాతర నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్‌బాబు, దోకల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఊరేగింపు

చింతలపూడి పట్టణంలో ఆదివారం ముత్యాలమ్మ జాతర సంబరాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో దేవతామూర్తుల వేషధారణ, విచిత్ర వేషధారణలతో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. జాతర సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారి వేషధారణలు, ప్రముఖ దేవతల వేషధారణలు, చిత్ర,విచిత్ర వేషాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కోయ డాన్సులు ప్రజలను ఆకట్టుకున్నాయి.

జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు

లింగపాలెం: అయ్యపరాజుగూడెం గ్రామానికి చెందిన అసైన్డ్ భూముల రైతులు జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇస్తే వీటిని నిషేధిత జాబితాలో చేర్చారంటూ రైతులు ఆదివారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. ఒరిజనల్ పట్టాలు పొందిన తమ పేర్లను నిషేధిత జాబితాల్లో చేర్చడం ఏంటని లబ్ధిదారులు ప్రశ్నించారు. గ్రామంలో సుమారు 100 మందికి పైగా పేద రైతులకు చెందిన దాదాపు 500 ఎకరాల అసైన్డ్ భూములను నిషేధిత జాబితాల్లో చేర్చారని జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. అధికారుల దర్యాప్తులో వాస్తవాలు తేలనున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

టి.నరసాపురం: కులం పేరుతో దూషించిన తండ్రి కొడుకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన బోడా వెంకటేశ్వరరావు అదే గ్రామానికి చెందిన రైతు పిన్నమనేని మురళీ వద్ద కమతం పనిచేస్తున్నాడు. హైస్కూల్ రోడ్డులో పిల్లలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని కలుపు మందును రోడ్డుకు ఇరువైపులా రైతు మురళీ కొట్టించాడు. ఈవిషయమై ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన మాలెంపాటి హరిబాబు, అతని కుమారుడు సంజయ్ ఇద్దరూ తనను పిలిచి కలుపు మందును కొట్టినందుకు కులం పేరుతో దూషించి చేతులతో కొట్టారని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బీసీల్లో వర్గ చైతన్యం అవసరం



నగరపాలక సంస్థ డీఈ పిలగల కొండలరావును సత్కరిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీల్లో వర్గ చైతన్యం ఏర్పడిన నాడే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘ కార్యాలయం నందు బీసీ కులాల జేఏసీ సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం ఉన్న బీసీలు కులాల వారీగా విడిపోయి వర్గ ప్రయోజనాలను విస్మరించడంతో పాలనలో భాగస్వామ్యం పొందలేకపోతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు గోపి, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా యాదవ సంఘ భవనానికి నిధులు, స్థలాన్ని కేటాయించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానికి ధన్యవాదాలు తెలియజేశారు. కలెక్టరేట్‌కు సమీపంలో విలువైన స్థలాన్ని కేటాయించడం వల్ల బీసీలు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు అనువుగా ఉందన్నారు. ఏలూరు జూట్ మిల్లు సెంటర్‌లో పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి బీసీ జేఏసీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు మొదటి నుంచి సహకరించిన ఏలూరు ఇండోర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నగరపాలక సంస్థ డీఈ పిలగల కొండలరావును ఏపీ బీసీ జేఏసీ పక్షాన సత్కరించారు. పలు బీసీ, ఉద్యోగ సంఘాల నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, కిలారపు బుజ్జి, మల్లిపూడి రాజు, గొర్ల రామారావు, జి.శ్రీధర్ రాజు, ఎం.సూర్యనారాయణ, తెంటు సూర్యనారాయణ, కాగిత అచ్చుత్, షేక్ జావిద్, ఎస్‌కే హుస్సేన్, నెరుసు నాగమణి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్ల నానిని కలిసిన అచ్యుతరామయ్య



ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అచ్యుతరామయ్య

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని పార్టీ జంగారెడ్డిగూడెం పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఆ దిశగా కార్యకర్తలను ముందుకు నడిపించాలని అచ్యుతరామయ్యకు సూచించారు. పార్టీ వచ్చే ఎన్నికల్లో నూతన చరిత్ర లిఖించి రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పదవిని అలంకరిస్తారని, ఇది సాకారం కావాలంటే ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేయాల్సి ఉందన్నారు. అనంతరం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, చింతలపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్‌ను అచ్యుతరామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతరామయ్య వెంట జంగారెడ్డిగూడెం పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌ను కలిసిన సందీప్

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి ఆదివారం ఏలూరు విచ్చేసిన సందర్భంగా ఆయనను లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలోని గోకుల్ కళ్యాణ మండపంలో భార్గవ్‌రెడ్డికి స్వాగతం పలికారు. తనను లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా నియమించినందుకు సహకరించిన వారందరికి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానికి, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ భార్గవ్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోమాచారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని హైదరాబాద్ ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సోమాచారి తెలిపారు. ఏలూరు రామచంద్రరావు పేటలోని గో సంరక్షణ సమితి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు గో సంరక్షణ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గో సంరక్షణ సమితి అధ్యక్షుడు గుర్రం సత్యనారాయణ ప్రారంభించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా రూ.4,500 విలువైన కలర్ డాప్లర్ అల్ట్రాసౌండ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సోమాచారి, ఆయన వైద్య బృందం ఈ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమాచారి మాట్లాడుతూ ఎవరికైనా రక్తనాళాలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తగిన వైద్యం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అక్కినేని వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు గో సంరక్షణ అధ్యక్షుడు నల్లా కాశి, గో సంరక్షణ సమితి కార్యదర్శి మునగాల మురళీకృష్ణ, ఏలూరు కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంబంగి జగదీష్, నాయకుడు మాకినేని సురేష్ పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

ఉంగుటూరు: కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండలు మండిపోతుండడంతో ప్రయాణానికి వాహనదారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారుతుంది. పది రోజుల నుంచి ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటి పూట ఎండలో తిరిగితే జ్వరం వస్తోందని ప్రజలు అంటున్నారు. ఇది రెండో వేసవి కాలంలా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. వ్యవసాయ పనులు చేసేవాళ్లు కూడా ఉదయం వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేస్తున్నారు.

అలరించిన గాత్ర సంగీత కచేరి



గాత్ర సంగీత కచేరి చేస్తున్న డీవీ మోహనకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కళా సంస్థలు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, హిందూ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గుడిపాటి గోపాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం గుడిపాటి లలితా శర్మ సహకారంతో కళారత్న డీవీ మోహనకృష్ణ నిర్వహించిన గాత్ర సంగీత కచేరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మోహనకృష్ణకు వయొలిన్‌తో పెరవలి నందకుమార్, మృదంగంతో పెరవలి జయ భాస్కర్ వాద్య సహకారం అందించారు. తొలుత వక్తలు మాట్లాడుతూ కర్ణాటక సంగీతాన్ని నూతన మార్గంలో పరవళ్లు తొక్కించిన పద్మభూషణ్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రియ శిష్యుడైన మోహనకృష్ణ ఆయన బాణీలను ముందుకు తీసుకు వెళుతూ గాత్ర సంగీత రంగానికి విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉభయ సంస్థల అధ్యక్షులు పరిమి సావిత్రి, యర్రా సోమలింగేశ్వరరావుల అధ్యక్షతన జరిగిన సభలో కళాకారులను ఘనంగా సత్కరించారు. ఫైన్ ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నాట్యాచార్య డి.హేమసుందర్ కళాకారులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఉభయ సంస్థల ప్రతినిధులు వేమా కోటేశ్వరరావు, డీఏ కృష్ణకుమార్, ఎల్.వెంకటేశ్వరరావు, పీవీఆర్ కృష్ణ శాస్త్రి, జయలక్ష్మి రామచంద్రన్, పార్వతి రామచంద్రన్, వీవీ హనుమంతరావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.